కథ

# జీవనవేదం

-పి.వి. శేషారత్నం



“అమ్మా! అమ్మా! చచ్చిపోతున్నాను బాబోయ్!” గది లోపలి నుంచి హృదయ విదారకంగా వినిపిస్తున్నాయి నాకూతురు అపురూప కేకలు.

నాకు గుండె దడ ఎక్కువగా ఉంది. జీవితంలో విషాదం డబ్బు లేకపోవడం మాత్రమే కాదు అని అర్థమయింది నాకా క్షణంలోనే.

కాకపోతే ఏమిటి?

కలవారి కుటుంబంలో గారాల పట్టిగా పుట్టి డాక్టర్ ఇంట మెట్టి అష్టైశ్వర్యాలతో తులతూగే నా అపురూప ఎంతో అపురూపమైన తొలి బిడ్డను కనవలసినవిధం ఇలాగేనా?

స్త్రీకి ప్రసవం, నొప్పులు ప్రకృతి సహజమే కానీ ఇలా ఈ ఊరుకాని ఊళ్లో.

భయానక వాతావరణంలో
చిన్న పెంకుటింట్లో
ఏ వైద్య సహాయం లేకుండా
ఓ సాధారణ వ్యక్తిలా అరుస్తూ ప్రసవ వేదన పడడం... ఎందుకిలా జరిగింది?

అసలిది ప్రసవించే టైము కాదు కూడా. అపురూప ఏడో నెలని, తీసుకెళ్తామని పృథ్వీతేజకి - అదే నా అల్లుడికి ఉత్తరం రాయడం అంతులేని చీరసారెలతో అపురూప అత్తారింటికి వెళ్లి వాళ్లని అన్ని విధాల తృప్తి పరచడం జరిగింది. వేడుకలన్నీ అపురూపంగా జరిగాయి.

‘వదినగారూ! అబ్బాయి డాక్టర్ కదా! మా కోడలు ఇక్కడే నీళ్లాడితే బాగుంటుంది కదా!’

వియ్యపురాలు నోట్లోంచి ఆ మాటలు వస్తున్నా అవి అల్లుడిగారి మనసేనని అర్థమయింది.

నా చిన్నారి తల్లి మీద అల్లుడికున్న అభిమానానికి నా మనసు పొంగిపోయింది.

కానీ,

అక్కడ నా కొడుక్కీ అపురూప తండ్రికీ బిజినెస్‌తో క్షణం తీరదు అందుకే.

నేను రెండు నెలలు ఇక్కడుండడం ఎట్టి పరిస్థితుల్లోనూ సాధ్యం కానిపని.

పైగా ఎంత ప్రేమానురాగాలున్నా ఆడపిల్లకి పుట్టింటిలో అపురూపంగా ఆనందోత్సాహాలతో ఉల్లాసంగా గడపగలిగే సమయం ఇదే.

ఆ చనువు, అప్యాయత - అనురాగం పద్ధతేవేరు - పైగా అపురూప ఫ్రెండ్స్ అంతా ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు.

అపురూప కూడా ఎప్పుడెప్పుడు అక్కడకి వచ్చేద్దామా అనే ఆత్రంతో ఉన్నట్టే అనిపించింది నాకు.

అందుకే మర్యాదపూర్వకంగానే అన్నాను - ‘మా అపురూప ఎంత అదృష్టవంతురాలు వదినా! అత్తగారే పురుడు పోస్తాననడం ఎన్నో జన్మల అదృష్టం - కాని మీ అన్నయ్యగారి గురించి ఒక్కసారి ఆలోచించండి - కన్న కూతుర్ని ఎప్పుడెప్పుడు చూస్తానా అని ఉవ్విళ్లూరుతున్నారు - బిజినెస్ టూర్ తప్పనిసరి కావడంవల్లగాని లేకపోతే అపురూపని ఇలా తీసికెళ్లగలిగే ఛాన్సు నాకు దొరకనిచ్చేవారు కారు తండ్రీ కొడుకూ - మీరేమీ అనుకోకండి - ముచ్చటగా గుమ్మడి పండంటి మనవడితో మీకోడలు ఎల్లకాలం ఉండేది ఇక్కడేగా - మా

ముచ్చట ఈ ఆరునెలలే.''

మా వియ్యపురాలు సాత్వికంగా నవ్వింది - అంగీకరిస్తున్నట్టు - అల్లుడు మాత్రం మరోసారి అపురూపకి ఇవ్వాల్సిన మందులు టైములు మళ్లీ మళ్లీ చెప్తూ ఎన్నో జాగ్రత్తలు చెప్పాడు.

'పదండి అత్తయ్యా మిమ్మల్ని ట్రైను ఎక్కిస్తాను. ఆపరేషన్స్ నాకు మధ్యాహ్నం కదా ఉన్నది.'

అపురూప మొహం విప్పారింది పువ్వులా. ఎంతయినా భార్యా భర్తల ఈ ఎడబాటు తప్పనిసరయినా బాధాకరమే ననే సత్యం నాకు తెలియంది కాదు.

పృథ్వీ మమ్మల్ని కార్లో దింపి భార్యను అరక్షణం కూడా విడవకుండా అలా రైలు ఎక్కించి కదిలేదాకా మాట్లాడుతూనే ఉన్నాడు.

ఈ మధ్యలో ప్రయాణమే పధ్నాలుగు గంటలు. ఫస్టు క్లాసు అందులోనూ ఎ.సి. కనుక అపురూపకి అలసట ఉండదు. ట్రెయిన్ దిగగానే బస్సులో రెండు గంటలు ఆ తర్వాత కారు ఎలాగూ ఉంటుంది రెడీగా. కానీ,

ఈ మధ్యలో ఇటువంటి అవాంతరం కలుగుతుందని కలగన్నామా?

ట్రెయిను ప్రయాణం సజావుగానే జరిగింది.

బస్సుకూడా వెంటనే దొరికింది.

అపురూపకి ఎలాంటి అలసటా లేదు ఏదో సహజమైన నీరసం తప్ప.

బస్సు కదిలిన దగ్గర్నుంచీ మబ్బులు కమ్ముకురావడం మొదలెట్టాయి.

షట్టర్స్ దించేసాం.

కానీ అరగంట గడిచేసరికి బస్సు ఆగిపోయింది.

అంతేకాదు - అడుగులోతు నీటిలో ఉంది.

జనం ఒకటే గోల

వాన తగ్గితే తప్ప బస్సు కదలడం అసాధ్యం అని తేల్చి చెప్పేసాడు డ్రైవర్.

వర్షం తగ్గే సూచనలెక్కడా లేవు.

బస్సులోనే కూర్చునే అవకాశం కూడా లేకపోయింది.

అంతకంతకూ నీటి మట్టం పెరుగుతోంది.

అందుకే బస్సు లోంచి దిగకపోతే ప్రమాదం అని అందరికీ అర్థం అయిపోయింది.

నాకు కాళ్లూ చేతులూ ఆడడం మానేసాయి.

అపురూప స్థితి చూస్తే నా గుండె చెరువైపోతోంది.

అవి నొప్పులేనని అర్థమైపోయింది.

ఈ ఊరుగాని ఊళ్లో, అసలిది ఊరో అడివో కూడా తెలీదు.

అపురూపని చూసి బస్సులో కొందరు సలహా ఇచ్చారు.

అక్కడకి అర కిలోమీటర్ దూరంలో చిన్న ఊరుందిట. అక్కడ మానవి అని ఒకావిడ పురుళ్లు పొయ్యడంలో నేర్పరిట.

అంతకంటే నాక్కూడా దారి లేదు.

ఇద్దరు జాలి గుండెవాళ్లు నాతోపాటు అపురూపని ఆ అడుగులోతు నీళ్లలో పడిపోకుండా నడిపిస్తూ ఆవిడ ఇల్లు చేర్చి వెళ్లిపోయారు.

నిజంగా ఆవిడ దేవతే - అటువంటి వేళకాని వేళలో ఏమాత్రం విసుగూ కంగారూ లేకుండా అపురూపని ఎంతో జాగ్రత్తగా లోపలికి తీసికెళ్లి - బట్టలు మార్పించింది. వేణ్ణీళ్లు పెట్టింది.

పధ్నాలుగేళ్ల పిల్ల ఆవిడకి సాయం చేస్తోంది, కూతురేమో.

నా పరిస్థితి గమనించి ఆవిడ నాకు వేడి కాఫీ ఇచ్చి బయట కూర్చోబెట్టింది.

అపురూప నా కన్న కూతురే అయినా నేనాడదాన్నే అయినా నాకున్న గుండెదడ వల్ల నేను లోపలికి వెళ్లేందుకే భయపడుతున్నాను - దాదాపు గంట తర్వాత.

'కేర్'మన్న బిడ్డ ఏడుపుతో ఈ లోకంలోకి వచ్చాను.

అంతటి ఆనందం నాకెపుడూ కలగ లేదు.

వేగంగా లోపలికి దూసుకెళ్తూ గుమ్మం తన్నుకుని పడబోయాను.

ఆ పిల్ల ఆపింది.

'బాబు పుట్టాడట అమ్మగారూ - అత్తమ్మ చెప్పింది' 'మీ అమ్మకాదా?'- ఆశ్చర్యపోయాను.

'అత్తమ్మ ఊరందరికీ అమ్మే - నాకు ఎవరూ లేకపోతే అత్తమ్మ సాకుతోంది.'

'రామ్మా-' ఆవిడ గొంతు అమృతపు సోనలా వుంది.

'తల్లీ బిడ్డల్ని మాత్రం నాలుగు రోజులు కదపకూడదమ్మా - చాలా కష్ట పడింది. బిడ్డ కూడా బలహీనంగా ఉన్నాడు ఈ పల్లెటూళ్లో అపుడపుడు ఇలాంటి బిడ్డల్ని సాకడం నాకలవాటే బెంగపడకండి.'

మర్నాడు సాయంత్రం వరకూ పృథ్వీకీ, మా వారికి వార్త పంపేందుకే ప్రకృతి సహకరించలేదు - కాని నాకు నిశ్చింతగానే వుంది.

తెలివి రాగానే అపురూప చేసిన మొదటిపని ఆవిడకి చేతులెత్తి మొక్కడం.

ఆవిడ పెద్దగా పట్టించుకోనే లేదు.

'ఇందులో నాదేముందమ్మా - అంతా



వాడి లీల - మనిషి ఇవ్వలేనిది తీసుకోగలిగేది ప్రాణమేనమ్మా - నా బంగారు తల్లి ప్రాణం పొయ్యగలిగే ఆ రాక్షసుడు చేతులారా తీసుకుంటూంటే నిశ్శబ్దంగా ఏడవడం తప్ప ఏం చెయ్యగలిగాను? అందుకే నా బిడ్డ బ్రతుకులా ఈ పల్లెటూళ్లో ఎవరి బిడ్డలకు కాకూడదని ఇది నేర్చుకుని చేతనైనంత సాయపడుతుంటాను - అంతా వాడిదయ' అంది పైకి చూస్తూ మానవి.

మానవి ఏకైక కూతురు సీతకి ప్రసవం కష్టమై డాక్టర్ దగ్గరకి తీసికెళ్తే - నాలుగు వేలిస్తే తప్ప ముట్టనన్నాడట - తర్వాత ఇస్తానని ఎంత బతిమాలినా వాడు వినకుండా, ప్రాణం పోతున్నా వదిలేసి వెళ్లిపోయాడట.

ఎంత రాక్షసత్వం?

తను డాక్టర్ అయ్యేందుకు పెట్టిన ఖర్చంతా ఇలాంటి సమయాల్లోనే రాబట్టుకోవాలనే అత్యాశ.

భగవంతుడు అలాంటి వాళ్లని విడిచిపెట్టడు - శిక్షించకపోడు - కాని ఎన్ని ప్రాణాలు ఈలోగా బలికావాలో?

మానవి కథ విన్నాక అపురూప కళ్లు కోపంతో ఎరుపెక్కాయి. వాడిని ఎన్నో శాపనార్థాలు పెట్టింది - తన బిడ్డను గుండెల్లో పొదువుకుంటూ.

ఆ సమయంలో మనుషులు ఎంత నరకం అనుభవిస్తారో స్వయంగా అనుభవించిన నా అపురూప శాపం వృథా కాదు.

కానీ,

మేం శాపనార్థాలు పెడుతున్నది - గోముఖ వ్యాఘ్రంలాంటి నా అల్లుడికేనని మా కబురందుకుని రెక్కలు కట్టుకుని వాలిన పృథ్వీ - మానవిని చూడగానే నిశ్చేష్టుడవడం చూసాక తెలిసింది - అతని మొహం తెల్లగా పాలిపోయింది.

'తల్లీ! నన్ను క్షమించమనే అధికారం నాకు లేదు కాని....'

మానవి నా చేతిలో డబ్బు అందుకోలేదు.

నిర్వికారంగా చూస్తూ వెనక్కి తిరిగి అంది.

'నా దృష్టిలో అది పాము విషం - నాక్కావలసింది మీరివ్వలేరు - నా సీత ప్రాణం - అది ఎంత డబ్బిచ్చినా రాదు. మీ అల్లుడు లాంటి వృత్తిలో మనుషులు, తియ్యగలిగేదే కాదు ఇవ్వగలిగేదీ అపురూపమైన ప్రాణాలు. ఈ జీవన వేదాన్ని గ్రహిస్తే చాలు -'

ఆ కొరడ దెబ్బ చాలు మా అల్లుడికి. ✸